నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, శుక్రవారం 29 నవంబర్ 2024 | SURYAPET

కేటీఆర్‌ను కలిసిన భగత్

హాలియా, నవంబర్ 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించినట్లు భగత్ పేర్కొన్నారు.

కోరలు చాస్తున్న సారాకాసి

సూర్యాపేట జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా

- పది నెలల్లో 1,030కిపైగా కేసులు.. వెలుగుచూడని స్థావరాలు వేలల్లో..
- గత సర్కారులో సారా తయారీని ఉక్కుపాదంతో అణిచివేసిన కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మళ్లీ విపరీతం

సూర్యాపేట, నవంబర్ 28: సూర్యాపేట జిల్లాలో సారా మహ్మమారి మళ్లీ కోరలు చాస్తున్నది. అమాయకుల ప్రాణాలను బలితీసుకుని, అనేక కుటుంబాలను రోడ్డున పడేసిన సారాపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తయారీ, విక్రయాలను కట్టుదిట్టంగా ఆపేసింది. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సారా నియంత్రణను గాలికి వదిలేసింది. దాంతో తండాలు, గ్రామాల్లో నాటుసారా విచ్చలవిడిగా తయారవుతున్నది. ఎక్కడ పడితే అక్కడ సారా తయారు చేస్తుండంతో నెలకు వంద కేసుల చొప్పున నమోదు అవుతున్నాయి. ఇంకా బయటకు రాని తయారీ స్థావరాలు వేలల్లో ఉంటున్నాయి. అందులో వెలుగు చూస్తున్న కేసులు కొన్ని మాత్రమే. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 1030పైగా కేసులు నమోదవగా, 800మందిపై కేసులు పెట్టారు.

జిల్లాలో సారా తయారీ విపరీతం అవుతున్నది. తండాలు, గ్రామాలే కాకుండా పట్టణాల్లోనూ సారా తయారు చేసి విక్రయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సారీ తయారీపై నియంత్రణ లేకపోవడంతో పరిస్థితి చేయి దాటిపోతున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గడిచిన పది నెలల్లో ఎక్సైజ్ శాఖ 1,030 కేసులు నమోదు చేసింది. అంటే సగటున నెలకు 90 నుంచి వంద సారా కేసులు నమోదు అవుతున్నాయి. ఇవి కేవలం ఎవరైనా ఇచ్చిన సమాచారంతో తనిఖీలు చేసి పట్టుకుంటున్నవి మాత్రమే. వాస్తవానికి క్షేత్రసాయిలో రహస్య ప్రదేశాలలో పెద్ద ఎత్తున్న సారా తయారు చేస్తూ విక్రయాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు నమోదైన సారా కేసుల్లో 4,650 లీటర్ల సారా, 1.90 లక్షల లీటర్ల పానకం, 22 వేల కిలోల బెల్లం, 4,500 కిలోల పటిక, 180 వాహనాలు పట్టుకోని సీజ్ చేశారు.

నాడు ఉక్కుపాదంతో అణిచివేత

సారా కారణంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని నిరుపేద ప్రజలు అనారోగ్యం బారిన పడి మరణాల సంఖ్య పెరుగుతుండడంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సమస్యను గుర్తించి రాష్ట్రంలో ఎక్కడా సారా తయారీ ఉండొద్దని నిర్ణయించారు. కేసీఆర్ పాలన ఉన్న వరకు జిల్లాలో ఎక్కడా సారా మాట వినిపించ లేదు. ఇతర ప్రాంతాల నుంచి కూడా రవాణా లేదు. సారా తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటుచేసుకుని జీవించిన వారి ఉపాధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. కిరాణం, పాడి పరిశ్రమ ఇలా వారు ఏది కావాలంటే అది ఏర్పాటు చేసింది. నాడు నల్లబెల్లం ఆనవాళ్లు కూడా కనిపించేవి కాదంటే సారాపై కట్టడి, ప్రజారోగ్యంపై శ్రద్ధ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం సారా తయారీని కట్టడి చేయకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. గత వారం రోజుల వ్యవధిలో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మీనాయక్‌తండా శివారులో జిల్లా ఎక్సైజ్, ఏసీ ఎన్‌ఫోర్స్ మెంట్ బృందం తనిఖీలో ఒక్క డీసీఎం వాహనంలోనే 2,750 కేజీల నల్ల బెల్లం, 40 కేజీల పటిక, 10 లీటర్ల సారాను పట్టుకున్నారు.

మళ్లీ సారా చావులు చూడాలా?

సమైక్య పాలనలో తెలంగాణలో సారా చావులు అనేకం. వృద్ధులే గాక నడి వయస్సు వాళ్లు, యువత కూడా సారాకు బానిసై చనిపోవడంతో వారి కుటుంబాలు దీన స్థితికి వెళ్లేవి. ప్రతి గ్రామంలో సుమారు వంద మంది వరకు సారాకు బానిసలుగా మారి చనిపోయిన వారు ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ సమస్యను గుర్తించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో సారా అనే పదం లేకుండా చేశారు. కానీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే సారా ఏరులై పారుతున్నది.

సారా తయారీపై ఫిర్యాదు చేయండి

జిల్లాలో సారా తయారీని ఉపేక్షించేంది లేదు. ఎక్కడైనా నల్లబెల్లం, పటిక కనిపిస్తే బాధ్యతగా వెంటనే సమాచారం అందించాలి. ఎనిమిది నెలలుగా పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేశాం. సరిహద్దు జిల్లాల నుంచి వచ్చే వాహనాలను కూడా పట్టుకుని కేసులు పెట్టాం. సారా తయారీపై ఎలాంటి సమాచారం ఉన్నా 8712658938 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

- ఆర్.లక్ష్మానాయక్, ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్, సూర్యాపేట



- సూర్యాపేటలో సద్దుల చెరువు వేదిక
- హాజరుకానున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల
- పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల, రవీంద్రకుమార్

తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకున్న 2009 నవంబర్ 29వ తేదీకి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఉంది. ఉద్యమాన్ని ములుపుతిప్పిన చారిత్రాత్మక దినంగా చరిత్ర పుటల్లో నిలిచింది. కేసీఆర్ అకుంఠిత దీక్షతో కొనసాగించిన ఆమరణ దీక్షతో అదే ఏడాది డిసెంబర్ 9న అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేయక తప్పలేదు. అందుకే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి నాందిగా భావించే నవంబర్ 29న బీఆర్ఎస్ పార్టీ యేటా దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్‌కు ఘనంగా ఏర్పాట్లు చేశారు. నేడు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఉద్యమకారులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దీక్షా దివస్‌లో భాగస్వాములు అయ్యేందుకు సన్నద్ధమయ్యారు.

– నల్లగొండ ప్రతినిధి/సూర్యాపేట, నవంబర్28(నమస్తే తెలంగాణ)

ఉద్యమ యాదిలో..

నేడు బీఆర్ఎస్ దీక్షా దివస్

పెద్దసంఖ్యలో తరలివచ్చేందుకు సన్నద్ధం

నల్లగొండ గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ దీక్షా దివస్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేలాది మంది తరలిరానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా స్థలాన్ని సిద్ధం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్న దీక్షా దివస్‌కు పార్టీలోని అన్ని స్థాయిల్లోని నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు, అభిమానులు తరలిరానున్నారు. ఇప్పటికే వారం రోజుల నుంచి విస్తృత ప్రచారం కల్పించారు. దీక్షా దివస్ సందర్భంగా ఆనాటి ఉద్యమ ఘట్టాలను, పోరాట స్ఫూర్తిని మరోసారి ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులందరికీ దీని ప్రాధాన్యతను వివరిస్తూ సోషల్ మీడియాలో, పార్టీ పరంగానూ సమాచారం చేరవేశారు. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ఎస్ దీక్షా దివస్ కోసం ప్రత్యేకంగా జిల్లాల వారీగా ఇన్‌చార్జీలను రంగంలోకి దించారు. వారి ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లాల వారీగా విస్తృత స్థాయి సన్నాహాక సమావేశాలు నిర్వహించారు. దీనికి పార్టీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దీక్షా దివస్ ఇన్‌చార్జీలతో కలిసి ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాల సన్నాహాక సమావేశాలకు హాజరయ్యారు. దీక్షా దివస్ ప్రాధాన్యతను వివరిస్తూ దిశానిర్దేశం చేశారు. ఆనాటి తెలంగాణ ఉద్యమ ఘట్టాలను, కేసీఆర్ త్యాగాలను, పోరాట స్ఫూర్తిని ఈ తరానికి తెలియపరిచేలా దీక్షా దివస్ జరుగాలని సూచించారు. ఇందులో పెద్ద సంఖ్యలో యువతను భాగస్వామ్యం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు కేసీఆర్ గొప్పతనాన్ని, పోరాట పటిమను, ఉద్యమ ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆ మేరకు దీక్షా దివస్ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో యువతను భాగస్వామ్యం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. అందుకు అనుగుణంగానే మండలాలు, గ్రామాల వారీగా కూడా తరలివచ్చేలా ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉదయం 9గంటల వరకే పార్టీ శ్రేణులంతా ఆయా జిల్లా కేంద్రాలకు చేరుకునేలా ఆదేశాలిచ్చారు. 10 గంటలకు ప్రారంభించి ఒంటి గంట వరకు కొనసాగేలా దీక్షా దివస్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆనాటి ఉద్యమ ముఖ్య ఘట్టాలతో రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు వీడియోలను ప్రదర్శించనున్నారు. దీక్షా దివస్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జీ, మాజీ ఎంపీ మన్నెం శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. దీక్షా దివస్‌కు సంబంధించి నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. దీక్షా దివస్ వేదిక, టెంట్లు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లపై పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. దీక్షా దివస్‌కు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

భువనగిరిలో..

భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ కార్నర్ వద్ద శుక్రవారం దీక్షా దివస్ చేపట్టనున్నారు.దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమం విజయవంతం చేసేందుకు పలువురు నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. 5వేల మందితో కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. భువనగిరి నియోజకవర్గం నుంచి 2వేల మంది, ఆలేరు నుంచి 1,500, మిగతా మూడు నియోజకవర్గాల్లోని 5 మండలాల నుంచి 1,500 మంది తరలిరానున్నరని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. అన్ని నియోజవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు బైక్, కార్ ర్యాలీలతో స్వచ్ఛందంగా తరలి రానున్నట్లు తెలుస్తున్నది. ఎమ్మెల్సీ, కార్యక్రమం ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరుకానున్నారు. దీక్షా దివస్ ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి గురువారం పరిశీలించారు. సభాస్థలి పనులపై ఆరా తీశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

సూరాపేటలో దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేటలో సద్దుల చెరువు వేదిక..

దీక్షా దివస్‌ను పురస్కరించుకొని సూర్యాపేటలో భారీ కార్యక్రమం చేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సన్నాహాలు చేసింది. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద 3వేల మందికిపైగా శ్రేణులతో కార్యక్రమం తలపెట్టింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్ తోపాటు కార్యక్రమం కో-ఆర్డినేటర్, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి పాల్గొననున్నారు.

నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

సూర్యాపేటకు దిక్సూచిగా జగదీశ్‌రెడ్డి..

సూర్యాపేట విషయానికి వస్తే 2009లో పిడికెడు మంది ఉద్యమకారులు మాత్రమే ఉన్నా ప్రతి కార్యక్రమం చేపట్టేవారు. నాడు సూర్యాపేటలో సిండికేట్ల రాజ్యం నడుస్తూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. అలాంటిది దీక్షా దివాస్ తరువాత సూర్యాపేటలో నిరంతరాయంగా చేపట్టిన దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ నాయకులు కూల్చి విధ్వంసం సృష్టించగా దాదాపు 15 గంటల పాటు పట్టణం నిర్మానుష్యంగా ఉంది. మరుసటి రోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉద్యమ నాయకుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు చేరుకొని కూలిన శిబిరం వద్దకు చేరుకుని ఉద్యమకారుల్లో ధైర్యం నింపి పట్టణంలో ర్యాలీకి సిద్ధమయ్యారు. అప్పటి వరకు ఏ కార్యక్రమం చేసినా రోడ్డు పక్కన ఉండి చూసేవారు, ఇండ్లకే పరిమితమైన వారు ఒక్కొక్కరుగా ర్యాలీలో చేరడంతో గంట వ్యవధిలోనే వేలల్లోకి చేరారు. అలా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది.

విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం చేపట్టబోయే దీక్షా దివాస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమం చేపట్టనున్న స్థానిక సద్దుల చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ వద్ద స్థలాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 3వేలకు మందికిపైగా దీక్షా దివస్‌కు హాజరవుతారని, ఆ మేరకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా నాటి ఉద్యమ సమయంలో చిన్న పిల్లలుగా ఉన్నవారు పెద్ద సంఖ్యలో వచ్చి ఉద్యమ విశేషాలు, నాటి ఉద్యమ ఘట్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉప్పల ఆనంద్, గుర్రం సత్యనారాయణరెడ్డి, జీడి భిక్షం, జూలకంటి జీవన్‌రెడ్డి, ఆకుల లవకుశ, చింతలపాటి భరత్ ఉన్నారు.

పెద్దసంఖ్యలో తరలిరావాలి

- నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, బీఆర్ఎస్

కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ప్రకటనకు నాంది పడిందని, అలాంటి దీక్షకు పూనుకున్న నవంబర్ 29న ఘనంగా దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. ఆనాటి ఉద్యమ ఘట్టాలను, కేసీఆర్ త్యాగాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడమే లక్ష్యంగా దీక్షా దివస్ కొనసాగుతుందని చెప్పారు. నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే దీక్షా దివస్‌కు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధిలో పదేండ్లల్లోనే దేశానికే దిక్సూచిగా తెలంగాణను కేసీఆర్ తీర్చిదిద్దితే... ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వం అధోగతి పాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ దుర్మార్గ పాలనపై తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించేలా దీక్షా దివస్ జరుగుతుందని స్పష్టం చేశారు.

ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న వికలాంగులు

పింఛన్ అందించాలని దివ్యాంగుల ధర్నా

సూర్యాపేట టౌన్, నవంబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేయూత పింఛన్‌ను రూ.4వేల నుంచి 6వేలకు పెంచుతామని చెప్పి.. ఏడాది కావస్తున్నా నేటి వరకు దాని గురించి పట్టించుకోక పోవడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై దివ్యాంగులు గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వికలాంగుల సమితి అధ్యక్షుడు షేక్ నయీమ్ ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ పింఛన్ రూ.6 వేలకు పెంచకుండా రెండు నెలలకోసారి ఇస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు సరిగా పింఛన్ ఇవ్వకుండా విజయోత్సవాలు జరపుకోవడం సిగ్గు చేటన్నారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి నెలా 5వ తేదీ లోపు పింఛన్ ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు లింగయ్య, గౌరవాధ్యక్షుడు బైరు వెంకన్న, ఉపాధ్యక్షుడు ఎరుకల రవి, బీఆర్‌వీఎస్ పట్టణాధ్యక్షుడు కంచుకొమ్ముల రాజశేఖర్, షమీం సుల్తానా, రమణ, లింగయ్య, వెంకటయ్య, శివయ్య పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభం

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- విద్యుత్ సంస్థల సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ

దామరచర్ల, నవంబర్ 28 : మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో యూనిట్‌లో డిసెంబర్‌లో పూర్తిస్థాయిలో 800 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు విద్యుత్ సంస్థల సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. ఈ మేరకు గురువారం పవర్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రారంభం కోసం ప్లాంట్‌లో నిర్మిస్తున్న ఫైలాన్, సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభానికి ముందు స్థానికులు, భూనిర్వాసితులకు కల్పించే ఉద్యోగాల గురించి అధికారులతో చర్చించారు. బీహెచ్ఈఎల్, టీఎస్ జెన్‌కో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జెన్ కో డైరెక్టర్లు, ప్లాంట్ సీఈ సమ్మయ్య ఉన్నారు.

నేటి నుంచి అర్వపల్లి ఉర్సు



విద్యుత్ వెలుగుల్లో ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా

అర్వపల్లి, నవంబర్ 28 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రెండ్రోజులపాటే సాగే ఉర్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది భక్తులు తరలిరానున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేసి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకురానున్నారు. అర్ధరాత్రి ఖవ్వాలి నిర్వహిస్తారు. శనివారం సాయంత్రం దీపారాధన ఉంటుంది. ఉర్సు సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా నిర్వాహకుడు మహమ్మద్ అబ్దుల్ హుస్సేన్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ షేక్ మహ్మద్ గురువారం ఏర్పాట్లను పరిశీలించాడు.